# నిద్రితనగరం - కవితాసంకలనం ఆవిష్కరణోత్సవం

డాక్టర్ వైదేహి శశిధర్ గారు రచించిన నిద్రితనగరం కవితాసంకలనం ఆవిష్కరణోత్సవ సభ జూన్ 27 వ తేదీ మధ్యాహ్నం 3 గంటలనుండి ఫ్రీ హోల్డ్ లోని స్వగృహంలో జరిగింది. సాహితీ మిత్రుల సందడితో పండుగ వాతావరణం తో సభ కళకళ లాడింది.

చేపూరు సుబ్బారావు గారు (రచయిత్రి నాన్నగారు) సభకు అధ్యక్షత వహించారు. రచయిత, తెలుగుజ్యోతి సంపాదకులు శ్రీ భావరాజు మూర్తిగారు, కవి, కథ రచయిత, విమర్శకులు, శ్రీ తమ్మినేని యదుకుల భూషణ్ గారు ప్రధాన వక్తలుగా పాల్గొన్నారు. రచయిత్రి భర్త శ్రీ సత్య శశిధర్ గారు సంకలనావిష్కరణ గావించారు.

అధ్యక్షోపన్యాసం లో సుబ్బారావు గారు కవిత్వం హృదయసంబంధి అని, అనుభూతి, దృశ్యం, లయ, సూచితార్థం (సజెషన్) ముఖ్యాంశాలుగా, మెటఫర్స్, సింబల్స్ సాధనాలుగా కవిత్వం సాధింపబడుతుందని చెబుతూ, డాక్టర్ వైదేహి శశిధర్ గారి కవితా పంక్తులు హృద్యమమైన వైరుధ్యాలు లేని మెటఫర్ల సమాహారాలని సోదాహరణంగా వివరించారు. కవిత్వం లో ఆవిష్కరించబడేవి అనుభూతులేనని, మెటఫర్లగా మలచబడ్డ ప్రకృతిలోని అందమైన దృశ్యాలను కవిత్వీకరణ మాధ్యమాలుగా రసస్ఫోరకం గా వాడుకోవటం వారి పొయెటిక్ క్రాఫ్ట్ కు సిగ్నేచర్ ట్యూన్ గా భావించవచ్చునని చెప్పారు. కవిత్వానికి వాదాలతో, నినాదాలతో పని లేదని మాటి మాటికీ గుర్తు వచ్చి పాఠకులని ఆనందపరవశులని చేయటం అసలు సిసలైన కవిత్వ లక్షణమన్నారు.

శ్రీ తమ్మినేని యదుకుల భూషణ్ గారు మాట్లాడుతూ కవిత్వం ఒక అన్వేషణ అని, జీవన మూలాలను గురించిన నిరంతర చింతన అని, అది ఏకాంతం లోంచి జనిస్తుందని చెప్పారు. ఏ కవిమీదనైనా మొదట తన అభిమాన కవి ప్రభావం ఉంటుందని, తిన్నగా ప్రభావం నుంచి బయటపడి తనదైన శైలిలో, తనదైన రీతిలో తన స్పందనలను వ్యక్తీకరించవలసి ఉంటుందని, కవిత్వం శోభిల్లేది నిరలంకారత, క్లుప్తత ల వల్లనని అన్నారు. సంకలనంలో ఈ గుణాలు కల కవితలని ఉదహరించారు.

శ్రీ భావరాజు మూర్తి గారు మాట్లాడుతూ కవిత్వం పదునైన పదచిత్రాల తో రూపం సంతరించుకునే ఇంద్రజాలం అని అన్నారు. మంచి కవిత కవి పొందిన అనుభూతి చెక్కుచెదరకుండా పాఠకుని హృదయం ఆర్ద్రమయ్యేలా స్పందింపజేస్తుందని, వారికి బాగా నచ్చిన కవితలని సంకలనం నుండి ఉదహరిస్తూ ప్రసంగించారు. నిద్రితనగరం వారి బాల్యాన్ని, విశాఖ తో వారికున్న సుదీర్ఘమైన సంబంధాన్ని, వారి మధురానుభూతులని ఎలా కెరలించిందో వివరించారు. వారి కవితలు చదువుతుంటే ఒకరకమైన ప్రత్యక్ష దృశ్యానుభవం కలుగుతుందని చెప్పారు. ముఖ్యంగా "అమ్మ" హృదయాన్ని జాలితో చలింపచేసిన కవిత అన్నారు.

తెలుగుజ్యోతి ఉపసంపాదకులు రాధగారు మాట్లాడుతూ పేరుకు ఇది నిద్రితనగరమైనా ఈ కవితలు మనలో ఆహ్లాదాన్ని జాగృతం చేసే కవితలు అన్నారు. చక్కటి భావ వ్యక్తీకరణ, భాషపై అధికారం, భావం లో గాంభీర్యం, శైలిలో సౌకుమార్యం డాక్టర్ వైదేహి శశిధర్ గారి సొత్తు అన్నారు.. "నిశ్శబ్దం నీకూ నాకూ మధ్య" ఇంకా ఇటువంటి కవితలు ఎన్నో, సార్వజనీనత కలిగిన అందమైన కవితలు అన్నారు. తనకు నచ్చిన కవితలను పేర్కొన్నారు.

డాక్టర్ వైదేహి శశిధర్ గారు తన కవితా ప్రస్థానానికి ప్రేరణల గురించి మాట్లాడుతూ తన అభిమానకవి తిలక్ గారని, ఆయన వెన్నెల జలపాతాల్లాంటి కవితలను గొంతెత్తి పాడుకుంటే ఎంత తన్మయత్వంగా, గర్వంగా ఉండేదో చెబుతూ, ఆయన కవిత్వం తనలో నిద్రాణంగా ఉన్న కవితాశక్తిని, కవితాసక్తిని జాగృతం చేసాయని చెప్పారు. దానికి తోడు వారి తండ్రిగారి ద్వారా నెలకొన్న సాహితీ వాతావరణం తన పొయెటిక్ సెన్సిబిలిటీస్ ని ఎలా ఉద్దీపనం చేసాయో గుర్తుచేసుకున్నారు. తన సంకలనం లోని కొన్ని కవితలని శ్రోతలకోరికపై చదివి వినిపించారు.

తర్వాత జరిగిన సాహితీ గోష్ఠి లో సభికులు ఎంతో విద్వత్తుతో, వివేచన తో గొప్ప సాహిత్యాభిరుచి తో పాల్గొన్నారు. పద్యపఠనం హృద్యమంగా జరిగింది.

ఆఖరుగా ఆంధ్రా వంటకాలతో విందు జరిగింది. మీటింగ్ ముగిసింది; కానీ అది ఒక మెమరబుల్ ఈవెనింగ్ గా మిగిలింది.